# జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

PUBLISHED FROM: MEDAK | సంపుటి: 02 | సంచిక: 79 | గురువారం, 27 నవంబర్, 2025 | epaper.medaktoday.net | పేజీలు: 05 | వెల: 02/-




ఎస్వీయూ యూనివర్సిటీలో

## చిరుత కలకలం

- సీసీ కెమెరాలో కోళ్ల గూడుపై చిరుత దాడి దృశ్యాలు రికార్డ్
- బోన్లకు చిక్కకుండా మూడు చిరుతలు సంచారం
- హడలిపోతున్నా ఎస్వీయూ సిబ్బంది, విద్యార్థులు



ఢిల్లీ కాలుష్యంతో

## నేనూ ఇబ్బందిపడ్డా

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- గంటపాటు వాకింగ్‌కు వెళ్లడంతో.. శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనట్లు వెల్లడి



## సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వండి

ఎంపీ ఈటల రాజేందర్‌కు టీఎస్ యూటీఎఫ్ వినతి

ఎయిరోస్పేస్.. డిఫెన్స్ హబ్‌గా

# హైదరాబాద్

## తెలంగాణ అభివృద్ధిలో ఇది మరో మైలురాయి

- సాఫ్రన్ సంస్థకు ధన్యవాదాలు
- హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఎంతో సంతోషం
- 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ
- పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలు
- తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జీఎంఆర్ ఎయిరోపార్కు ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సెంటర్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




**హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్‌లో సాఫ్రన్ ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ, ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్ఈజెడ్) లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్ గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారిందని చెప్పారు. బెంగుళూరు – హైదరాబాద్‌ను డిఫెన్స్ మరియు ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మత్తులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతో పాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సెంటర్ ఏర్పాటు ఎయిరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని సీఎం చెప్పారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్ట మొదటి సెంటరని వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తో పాటు సాఫ్రన్‌కు చెందిన ఎం88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమత్తులు, ఓవర్ హాల్ (ఎంఆర్‌వో) కు శంకుస్థాపన చేసుకోవడం సంతోష కరమైన పరిణామమని పేర్కొన్నారు. ఈ ఎంఆర్‌వో భారత వైమానిక దళం, నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుంది. సాఫ్రన్ దాదాపు 1300 కోట్ల రూపాయల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానించడం, పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోంది. తెలంగాణ అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింది. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీల నుంచి..




# హైడ్రా చర్యలు భేష్..

## చెరువుల పునరుద్ధరణ అద్భుతం

## నగరంలోని చెరువులను సందర్శించిన కర్ణాటక బృందం

**హైదరాబాద్ ప్రతినిధి**

ఆక్రమణలు తొలగించి చెరువులను పునరుద్ధరించడం గొప్ప పరిణామమని కర్ణాటక బృందం హైడ్రాను కొనియాడింది. చెరువుల పునరుద్దరణ పనులు ఎలా జరుగుతున్నాయని కర్ణాటకలోని బెంగళూరును సందర్శించిన హైడ్రా.. నెలల్లోనే మెరుగైన పనితీరుతో హైదరాబాద్‌లో ఫలితాలు సాధించిందని అభినందించారు. బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుతో పాటు నగరంలో మొదటి విడతగా హైడ్రా పునరుద్ధరించిన పలు చెరువులను కర్ణాటకలోని వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. అనంతరం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి చెరువుల..


మిగతా 12వ పేజీలో..


# తెలంగాణ వన్యప్రాణి సంరక్షణలో కొత్త అధ్యాయం

## దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ అటవీ శాఖ చర్యలు

- ప్రయోగాత్మకంగా టెక్నాలజీతో వైల్డ్ సేఫ్టీ
- అడవులు, అడవుల్లో వన్యప్రాణులను
- సంరక్షించడమే మా జెండా.. ఎజెండా
- అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో పులుల సంరక్షణలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నాయకత్వంలో హైదరాబాద్ అరణ్యభవన్‌లో స్టేట్-లెవల్ టైగర్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించింది. ఈ చర్య పులలను పరిరక్షించేందుకు పెద్ద ఎత్తున ఉపయోగపడనుంది. దాంతోపాటు, పులులు, మనుషుల మధ్య సంఘర్షణను కూడా తగ్గించనుంది. దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికీ జిల్లాల వారీగా, విడివిడిగా పులుల కదలికలను గమనిస్తుండగా, తెలంగాణ మాత్రం మొత్తం రాష్ట్రాన్ని కవరుచేసే కేంద్రీకృత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఇలాంటి సాంకేతిక వ్యవస్థలు ప్రస్తుతం కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలో మాత్రమే కొంతవరకు అమల్లో ఉన్నాయని అటవీ అధికారులు చెబుతున్నాయి. 2023 డిసెంబర్ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అటవీ శాఖ మంత్రి అయ్యాక... ఈ చర్యలు మరింత వేగవంతం అయ్యాయి.

### అసలు టైగర్ సెల్ ఎందుకు..?

సాధారణంగా వన్యప్రాణి విభాగాలు తమ తమ పరిధుల్లోనే పని చేస్తుంటాయి. కానీ, తెలంగాణ నూతన టైగర్ సెల్ ఇందుకు వినూత్నంగా ఉన్నది. ఈ విభాగం నిత్యం పులులు, చిరుత పులుల కదలికల పర్యవేక్షించనున్నది. దాంతోపాటు, పులులు... పులుల మధ్య ఘర్షణ ప్రాంతాలు... మనుషులు, పులుల మధ్య సంఘర్షణ ప్రాంతాలను గుర్తించి నిత్యం నిఘా ఉంచుతుంది. దాంతోపాటు, ఆ ప్రాంతాన్ని అనునిత్యం అంచనా వేస్తూ మ్యాపింగ్ చేసి పెట్టనుంది. దాంతోపాటు, అడవి ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ట్రాకింగ్ చేయనుంది. యాంటీ-పోచింగ్, రెస్క్యూ బృందాల తక్షణ పాట్రోలింగ్ చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇవన్నీ సమగ్రంగా ఒకే చోట నిర్వహించే వ్యవస్థ ఈ టెగల్ సెల్ కింద చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థ భారతదేశంలో చాలా అరుదుగా ఉంది.

### పులుల కారిడార్లలో టైగర్ సెల్ ఎలా ఉపయోగం?

రాష్ట్రంలోని కవాల్, ఏటూరునాగారం, కిన్నెరసాని, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల్లోని పులుల కదలికలు సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. వీటితో పాటు మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్-ఉత్తర తెలంగాణ అడవులను ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతాలతో కలిపే ఈ మార్గం దేశవ్యాప్తంగా ముఖ్యంగా టైగర్ కారిడార్‌గా గుర్తించి ఆ ప్రాంతాల్లో నిఘా ఉంచనున్నారు. అయితే, పొరుగు రాష్ట్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోయినా, తెలంగాణ మాత్రం నిరంతర మానిటరింగ్ చైన్‌ను ఏర్పరచి ముందడుగు వేయడం సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నది. పులుల సంచారం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్విక్ రియాక్షన్ టీమ్స్ పై ఈ సెల్‌కు ప్రత్యక్ష నియంత్రణ ఉండనుంది. ఇతర రాష్ట్రాల్లో సాంప్రదాయ పద్ధతిలో జిల్లాల అనుమతులతో ఆలస్యం జరుగుతుంది. తెలంగాణలో మాత్రం టైగర్ కమాండ్ సెంటర్ నుంచే నేరుగా టీంలను పంపే విధానాన్ని ఈ విధానంలో అవలంభించనున్నారు. పులులు గ్రామాల వద్ద కనిపించినా, వేట ముఠాల కదలికలు ఉన్నా, పశువులపై దాడులు జరిగినా, గాయపడిన పులులకు చికిత్స అవసరమైనా – స్పందన మరింత వేగంగా అందేలా వ్యవస్థ రూపొందించి ముందుకు వెళుతున్నారు.

### శాస్త్రీయ పద్ధతిలో పులుల సంరక్షణ...

టైగర్లపై రేడియో కాలర్ అమర్చే కార్యక్రమాన్ని కూడా తెలంగాణ ప్రారంభించేందుకు సిద్ధమైందని అటవీ అధికారులు చెబుతున్నారు. కర్ణాటక, ఉత్తరాఖండ్..


మిగతా 12వ పేజీలో..




# భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవం
- పలు భాషల్లో రాజ్యాంగ ప్రతులు విడుదల



**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా ఏటా నవంబరు 26న 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం)లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వం వహించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు...

# విధానాలు మార్చుకోకపోతే మహోద్యమమే

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే
- కార్మికులకు వేతన రక్షణ కల్పించాల్సిందే
- విద్యుత్ బిల్లు -2025ను వెనక్కు తీసుకోవాలి
- ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో ఎస్‌కేఎం, కార్మిక సంఘాల నాయకులు




**హైదరాబాద్ ప్రతినిధి**

కేంద్రంలోని బిజెపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా మహోద్యమం నిర్వహిస్తామని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం), కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, యస్ కె యం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, బి రాము,మామిడాల బిక్షపతి,జక్కుల వెంకటయ్య,డిజి ప్రసాద్,కొండల్, ఉపేందర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్,ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, బాలరాజు టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, టిఆర్ఎస్కెవి రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ హెచ్ఎంఎస్ తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ...నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,కనీస వేతనాల హక్కును రక్షించాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరల చట్టం (సి2+50) కొనుగోలుకు గ్యారెంటీ చేస్తూ చేయాలి. వెంటనే ప్రభుత్వం అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణ మాఫీ పథకాన్ని ప్రకటించాలి. మైక్రో ఫైనాన్స్ దోపిడీని నియంత్రించాలి. వడ్డీ రేటును నియంత్రించాలి, రైతులకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేయడానికి ఆర్బీఐ మిగులును నాబార్డ్ కి బదిలీ చేయాలి. విద్యుత్, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు. విద్యుత్ బిల్లు – 2025 ను రద్దు చేయాలి. గృహవినియోగ దారులందరికి నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి. భారతదేశంపై అమెరికా 50 శాతం సుంకం విధించడాన్ని ఎదుర్కోవాలి. పత్తి, పాడి పరిశ్రమ రంగాలలో స్వేచ్ఛా వాణిజ్యం వద్దు. పత్తిపై 11% దిగుమతి సుంకాన్ని రద్దు చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలి. ఇండో-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి. రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి. భారతదేశంలో సాధారణ పంటల సమయంలో పంట ధరలను తగ్గించే అన్ని వ్యవసాయ పంటల దిగుమతులను నిషేధించాలి. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు పరిహారం ఇవ్వాలి. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి. ఈ పథకం ద్వారా 200 రోజుల పని, రోజు కూలీ రూ.700 ఉండేలా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. క్యాజువల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి. నియామకాలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ, ప్రభుత్వ రంగం సంస్థలలో ఖాళీగా ఉన్న 65 లక్షల పోస్టులను భర్తీ చేయాలి. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. రిజర్వేషన్లను కాపాడటానికి ప్రైవేటీకరణను ఆపాలి. ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలకు సామాజిక రిజర్వేషన్లను కఠినంగా అమలు చేయాలి.

వ్యవసాయ భూమిని విచక్షణారహితంగా సేకరించడాన్ని ఆపాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ బాధితులందరికీ గ్రామీణ ప్రాంతాల్లో 4 రెట్లు, పట్టణ ప్రాంతాల్లో 2రెట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ వనరులపై గిరిజన హక్కులను కాపాడటానికి అటవీ హక్కుల చట్టం, పెసా(గిరిజన ప్రాంతాలలో పంచాయితీల విస్తరణ చట్టం) చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. భూమి, అడవి, నీరు, ఖనిజాలను కార్పొరేట్ లకు కట్టబెట్టొద్దు. స్థానిక ప్రజల (ముఖ్యంగా గిరిజన కుటుంబాల) అభివృద్ధి కోసం మైనింగ్ నుండి 60% మిగులును స్థానిక సంస్థలకు కేటాయించాలని సూచించారు. విఫలమైన ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన ను రద్దు చేయాలి, ప్రభుత్వ రంగంలో ఎల్ఐసి వంటి కార్పొరేషన్ ల ద్వారా పంటలు, పశువుల కోసం బీమాను నిర్వహించే ఏర్పాటు చేయాలి. కేంద్ర బడ్జెట్‌లో తగ్గించిన రూ.87,000 కోట్ల ఎరువుల సబ్సిడీని పునరుద్ధరించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.ఎరువుల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలి. మొత్తం వ్యవసాయ భూమికి నీటి హక్కులు కల్పించాలని నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ నాయక్, కెవిపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, అడిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, సిఐటియు నగర కార్యదర్శి స్వర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


## సంపాదకీయం

# పేదల విద్యకు.. నిధుల కొరతా?


ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉన్నత విద్య అనేది ఇప్పటికీ ఒక కల. ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమైన సంక్షేమ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇది పుట్టుకతోనే సామాజిక న్యాయానికి పునాదులు వేసిన పథకం. పేద విద్యార్థుల చదువు డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, ప్రతిభకు అవకాశాల ద్వారాలు తెరవాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో2008లో ప్రారంభమైన ఈ పథకం నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం ఆయా రాష్ట్రాల స్వంత పంథాలో నడుస్తోంది. ఈ పథక లక్ష్యం 'విద్య పేదలకు చేరాలంటే, డబ్బు అడ్డంకి కాకూడదు' అందుకే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరి ఉన్నత విద్య పొందేలా ప్రభుత్వమే ఫీజు భారం భరించాలనే ఆలోచన నుంచి ఇది రూపుదిద్దుకుంది. ఈ పథకం వల్ల లక్షలాది విద్యార్థులు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ఈ పథకం వలన ప్రైవేటు కాలేజీలు కూడా వీరికి ప్రభుత్వ భాగస్వామ్య విద్యా కేంద్రాలుగా మారాయి. ఈ రీయింబర్స్మెంట్ వల్ల సమాజంలో కొన్ని గమనించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. పేద కుటుంబాల పిల్లలు ఇప్పుడు ప్రొఫెషనల్ కోర్సులు చదవగలుగుతున్నారు. ఉన్నత చదువు కారణంగా వారికి వృత్తి అవకాశాలు లభించి, పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి రావడం మొదలైంది. చిన్న ఊర్లలో, మారుమూల తండాల్లో, గిరిజన గూడాల్లో కూడా ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగింది. పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణాలు. దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్‌లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు.ప్రభుత్వానికి సమాంతరంగా విద్యా సేవ అందిస్తున్న ప్రైవేటు కాలేజీలు ఎందుకు వివక్షకు గురవుతున్నాయి అనేదే ఇప్పుడు ప్రశ్న. ఇవి ప్రభుత్వం కోసం విద్యా భాగస్వాములుగా పని చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల కింద సీట్లు ఇచ్చి, వారికి క్లాసులు, సౌకర్యాలు, సిబ్బందినీ అందిస్తున్నాయి. కానీ రీయింబర్స్మెంట్ మొత్తాలు సకాలంలో రాకపోవడం వల్ల ఈ సంస్థలు జీతాలు, ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు అందించడంలో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రైవేట్ కాలేజీలు లాభాపేక్షతో కూడినవైనా, వాస్తవంగా ఇవి ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్న సంస్థలు. అందుకే వీటిని వివక్షగా చూడకుండా 'భాగస్వాములు'గా గుర్తించి సహకరించడం సమాజ ప్రయోజనానికి అవసరం. ప్రైవేట్ కాలేజీలు విద్యతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి.

వేలాది మంది ఈ కాలేజీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం వలన ఈ వర్గాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. జీతాల ఆలస్యం, ఉద్యోగాల కోతలు, సంస్థల మూతపడే పరిస్థితి, ఇవన్నీ సామాజిక తిరోగమన వృద్ధికి సంకేతాలు. పేద విద్యార్థులకు ఆర్థిక అడ్డంకులు లేకుండా చదివే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలు కేవలం ప్రభుత్వ పత్రాలలో ఉండకూడదు. అవి పేద విద్యార్థి ఇంట్లో వెలిగే దీపం. ఒక కుటుంబం చదువుతో ఎదిగితే, దాని ప్రభావం తర తరాల మీద ఉంటుంది. నిధుల ఆలస్యం, వివక్ష, రాజకీయ ప్రాధాన్యతలతో ఈ దీపం ఆరిపోకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. నిధుల విడుదలలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా, నిధులు సకాలంలో విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి. విద్యలో పెట్టుబడి అంటే దేశ భవిష్యత్తులో పెట్టుబడి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని మర్చిపోతే, పేద విద్యార్థుల కన్నీటి చరిత్ర మనం చదవాల్సి వస్తుంది.

# నిబద్ధత గల నేత వీపీ సింగ్



భారత దేశ రాజకీయాలలో తనదంటూ ప్రత్యేక ముద్ర వేసిన నేత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్. పధాన మంత్రి కావడానికి ముందు అవినీతిపై పోరాడటానికి అధికారాన్ని త్యాగం చేసిన ఆదర్శ నేత ఆయన. వీపీ సింగ్ అవినీతిని జాతీయ సమస్యగా మార్చాడు. వివాదాస్పదమైన బోఫోర్స్ తుపాకీ ఒప్పందంపై రాజీవ్ గాంధీ ప్రభు త్వాన్ని ఇరకాటంలో పెట్టాడు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లడానికి కేబినెట్ నుండి రాజీనామా చేశాడు. హెచ్‌డిడబ్ల్యూ జలాంతర్గామి ఒప్పందానికి సంబంధించిన విచారణపై అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీతో విభేదాల కారణంగా తాను రాజీనామా చేశానని 2005 లో శేఖర్ గుప్తాకు ఇచ్చిన ఇంట ర్వ్యూలో చెప్పాడు. రక్షణ ఒప్పం దాలలో అవినీతి 1989 లోక్‌సభ ఎన్నికలలో కేంద్ర సమస్యగా మారింది. అంతేగాక 1990 ఆగస్టులో, విపి సింగ్ పార్ల మెంటులో చాలా కాలంగా మరచిపోయిన మండల్ కమిషన్ నివేదిక సిఫారసులను ప్రవేశపెట్టి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబిసి సమాజ రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసిన ప్రధానిగా చరిత్రలో మిగిలి పోయాడు. వీపీ సింగ్ వర్థంతి సందర్భంగా ఆయన జీవితంలో కొన్ని ముఖ్యాంశాలను గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (జూన్ 25, 1931 – నవంబరు 27, 2008) భారతదేశ ఏడవ ప్రధాన మంత్రిగా 1989 నుండి 1990 వరకు పనిచేసాడు. ఆ సమయంలోనే మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన కులాలకు 27% రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించాడు. వీపీ సింగ్ 1931 జూన్ 25 న మండా ఎస్టేట్ ను పరిపాలించిన రాజపుత్ర జమీందారీ కుటుంబంలో జన్మించాడు. అయన డెహ్రాడూన్ లోని కలనల్ బ్రౌన్ కేంబ్రిడ్జ్ స్కూలులోబీ అలహాబాద్, పూణె విశ్వవిద్యాలయాలలో చదివాడు. రాజస్థాన్ లోని డియోగర్ – మడారియా రాజు కుమార్తె అయిన సితా కుమారిని 1955 జూన్ 25 న వివాహం చేసుకున్నాడు. ఇది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. ఈ వివాహం జరిగినపుడు ఆయనకు 24 సంవత్సరాలు, ఆమెకు 18 సంవత్సరాలు. 1969లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యుడయ్యాడు. 1971 లో లోక్‌సభకు ఎన్నిక య్యాడు. 1974లో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ ఉపమంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 1976 నుండి 1977 వరకు వాణిజ్య శాఖా మంత్రిగా తన సేవలనందించాడు. 1980లో జనతా పార్టీ తరువాత ఇందిరా గాంధీ మరల ఎన్నుకోబడినప్పుడు, ఇందిర ఆయన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని చేసింది. అలా 1980%–%82 వరకు పని చేశాడు. 1983లో తిరిగి వాణిజ్య మంత్రి పదవిని పొందాడు.1984 సార్వత్రిక ఎన్నికల తరువాత భారతదేశ 10వ కేబినెట్ లో ఆర్థిక మంత్రిగా రాజీవ్ గాంధీచే నియ మితుడయ్యాడు. బహుశా గతంలో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయాన్ని అందించిన పారిశ్రామిక వేత్తలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుపుతున్నందున ఆ పదవి నుండి తొలగించ బడ్డాడు. ఆర్థిక మంత్రిత్వ శాఖనుండి ప్రక్కకు తప్పించినప్పటికీ, సింగ్ కు దేశ ప్రజలలో ఉన్న జనాదరణ కారణంగా 1987 జనవరిలో రక్షణ మంత్రి బాధ్యతలను అప్పగించారు. నాలుగు వందల 155ఎంఎం శతఘ్నులను స్వీడిష్ కంపెనీ ఏబీ బోఫోర్స్ కంపెనీ నుంచి 1437 కోట్ల రూపాయల ఖర్చుతో కొనడానికి ఒప్పందం కుదిరిన విషయంలో, భారతదేశం, స్వీడన్ ప్రభుత్వాల్లోని పెద్దల మధ్య జరిగిన అవకతవ కలపై దృష్టి సారించాడు. ఈ అంశం రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని కుదిపేసింది. దానిపై దర్యాప్తు చేయించ డానికి ముందే ఆయనను క్యాబినెట్ నుండి తొలగించారు. ఫలితంగా సింగ్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, లోక్‌సభ సభ్య త్వానికి రాజీనామా చేసాడు. 1989 ఎన్నికలలో రాజీవ్ గాంధీని పదవినుంచి తొలగించటానికి, ఆయనకు వ్యతిరేకంగా వామ పక్షాలు, భారతీయ జనతా పార్టీతో కలసి ఒక కూటమి ఏర్పాటు చేయడానికి సింగ్ బాధ్యత వహించాడు. 1989లో ఆయన పాత్ర భారత రాజకీయాల దిశను మార్చింది.కాంగ్రెస్ పార్టీ నుండి బయటికి వచ్చిన తరువాత సింగ్... అరుణ్ నెహ్రూ, అరిఫ్ మొహమ్మద్ ఖాన్ లతో కలసి జనమోర్చా పేరుతో ప్రతిపక్ష పార్టీని ప్రారంభించాడు. అలహాబాద్ లోక్‌సభకు జరిగిన ఉపన్నికలలో సునీల్ శాస్త్రిని ఓడించి తిరిగి ఎన్నికయ్యాడు.1988 అక్టోబరు 11 న జనతాపార్టీ సంకీర్ణం నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ జన్మదినం సందర్భంగా రాజీవ్ గాంధీని వ్యతిరేకించే పార్టీలైన జనమోర్చా, జనతాపార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) పార్టీలను కలిపి జనతాదళ్ పార్టీని స్థాపిం చాడు. జనతాదళ్ పార్టీకి అధ్యక్షు డైనాడు. ద్రవిడ మున్నేట్ర ఖగజం, తెలుగుదేశం పార్టీ, అసోం గణ పరిషత్ వంటి ప్రాంతీయ పార్టీలతో కలసి జనతాదళ్ పార్టీ నేషనల్ ఫ్రంట్ పేరుతో సంకీర్ణ దళం ఏర్పడినది. దీనికి వి.పి.సింగ్ కన్వీనరుగా, ఎన్.టి.రామారావు అధ్యక్షునిగా, పర్వతనేని ఉపేంద్ర జనరల్ సెక్రటరీగా నియమి తులయ్యారు. 1989 సార్వత్రిక ఎన్నికలలో నేషనల్ ఫ్రంటు, కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలైన భారతీయ జనతా పార్టీ, వామపక్ష పార్టీల (రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలను)తో కలసి సీట్ల సర్దుబాటు చేసుకొని పోటీ చేసింది. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీల నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ, కమ్యూ నిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వంటి వామపక్షాలు ప్రభుత్వం బయటి నుండి మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పడింది. పార్లెమెంటు సెంట్రల్ హాల్ లో 1989 డిసెంబరు 1 జరిగిన సమావేశం ద్వారా వి.పి.సింగ్ ప్రధాన మంత్రిగా ఎన్నుకోబడి, 1989 డిసెంబరు 2 న భారత దేశ 7వ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, 1990 నవంబరు 10 వరకు ఒక సంవత్సరం లోపే ప్రధాన మంత్రిగా పనిచేసాడు. మార్చి 1990 లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సింగ్ సంకీర్ణ పభుత్వం పార్లమెంటు లోని రెండు సభలలో నియంత్రణ సాధించింది. ఈ కాలంలో జనతాదళ్ పార్టీ ఐదు రాష్ట్రాలలో అధికారం చేజిక్కించు కుంది. హర్యానా రాష్ట్రంలోని ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం, గుజ రాత్ లోని చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వం, ఒడిశాలోని బిజూ పట్నాయక్ ప్రభుత్వం, బీహార్ లోని లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ లోని ములాయం సింగ్ యదవ్ ప్రభుత్వాలను జనతాదళ్ పార్టీ ఏర్పరచింది. నేషనల్ ఫ్రంటు లోని మిత్రపక్షాలైన ఎన్.టి రామరావు, ప్రఫుల్ల కుమార్ మహంతా కూడా ప్రభుత్వాలను ఏర్పరచారు. జనతాదళ్ కేరళ రాష్ట్రంలోని ఇ.కె.నాయనార్ తో, రాజస్థాన్ లో భైరాన్ సింగ్ షెకావత్ తో కూడా అధికారాన్ని పంచుకుంది. మండల్ కమిషన్ నివేదికమండల్ కమిషన్ భారత దేశంలోని సామాజిక, విద్యాపరంగా వెనుక బడిన తరగతుల పరిస్థితులని అధ్యయనం చేసే కమీషన్. దీనిని 1979 జనవరి 1న అప్పటి జనతా పార్టీ కి చెందిన భారత ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ చే ప్రారంభించ బడినది. ఆ కాలంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఛైర్మన్ గా బి.పి.మండల్ వ్యవహరించాడు. అయన రూపొందించిన మండల్ కమిషన్ నివేదిక భారత దేశంలో వెనుక బడిన తరగతులు, యితర వెనుక బడిన తరగతులుగా సూచించ బడిన కులాలకు సామాన్య జన స్రవంతిలో అను సంధానం చేసే మార్గాలను అధ్యయనం చేసి క్రమ బద్ధము, న్యాయ బద్ధమూ అయిన విధాన నిర్మాణాన్ని ప్రభుత్వానికి సమర్పిం చింది. కానీ ఆ సమయానికి మురార్జీ దేశాయి ప్రధాని పదవి నుండి వైదొలగ వలసి వచ్చింది. తరువాత కాంగ్రెస్ పాలనలో సుమారు 10 సంవత్సరాలు మండల్ కమిషన్ నివేదిక బుట్ట దాఖలు అయిపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పతనమై వి.పి. సింగ్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికకు తన ప్రభుత్వ ఆమోద ముద్ర వేసాడు. ఓబిసి రిజర్వేషన్లను (క్రిమీలేయర్ కంటే దిగువన) 2008 లో సుప్రీం కోర్టు సమర్థించింది. ఆయన పాలనా సమయంలో శ్రీలంక లోని తమిళ వేర్పాటు వాద ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి అంతకు పూర్వం రాజీవ్ గాంధీ భారత సైన్యాన్ని పంపించి చేపట్టిన, విఫలమైన ఆపరేషన్‌కు ముగింపు పలకాలని నిర్ణయించాడు. భారత సరిహద్దులో యుద్ధాన్ని ప్రారంభించేందుకు బెనజీర్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను ఆయన అడ్డుకున్నాడు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# డిజిటల్ అరెస్టుల అసలు కథ!

దేశంలో డిజిటల్ అరెస్టుల అంశంపై చర్చ జరుగుతూనే ఉంటుంది. దీనిపై ప్రజలకు ఎంత అవగాహన చేసినా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతూనే ఉంటున్నారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బెదిరించి ఏకంగా రూ.32 కోట్లు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు.. ఇటీవలి కాలంలో వెలుగు చూసిన అతిపెద్ద సైబర్ నేరంగా ఈ కేసును పోలీసులు భావిస్తున్నారు. వీడియో కాల్‌లో సీబీఐ అధికారులుగా నటిస్తూ, సదరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి రూ. 32 కోట్లు సైబర్ నేరగాళు కొల్లగొట్టినట్లు పోలీసు వర్గాల కథనం. అమాయక ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతులు ఎంచుకుంటూ ఉంటారు. అందులో భాగంగా సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త పద్ధతే ఈ డిజిటల్ అరెస్టులు.. ఈ డిజిటల్ అరెస్టుల పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయపెట్టి మోసం చేస్తున్నారు. టార్గెట్‌గా ఎంచుకున్న వారికి వీడియో కాల్ చేస్తారు. తమను తాము సీబీఐ అధికారులగానో లేక ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లగానో పరిచయం చేసుకుంటూ వీడియో కాల్ చేస్తారు. బెదిరింపులకు భయపడ్డ వారి దగ్గర నుంచి సైబర్ నేరగాళ్లు పెద్ద ఎత్తున డబ్బు కాజే స్తున్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. హర్యానాలోని అంబాలాకు చెందిన ఒక సీనియర్ సిటిజన్ ఫిర్యాదు ఆధారంగా సుమోటాగా సుప్రీంకోర్టు కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.అంబాలాకు చెందిన 73 సంవత్సరాల ఒక మహిళ.. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు ఒక ఫిర్యాదు చేసింది. తనను డిజిటల్ అరెస్టు చేయవలసిందిగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారని సదరు మహిళ పేర్కొన్నారు. కోటి రూపాయలు చెల్లిస్తే.. సదరు డిజిటల్ అరెస్టు నుంచి బయట పడేస్తామని సైబర్ నేరగాళ్లు హామీ కూడా ఇచ్చారని ఆమె ఫిర్యాదులో వెల్లడించారు. కాగా న్యాయస్థానం ఆదేశాలు ఉన్నట్లు నేరగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగ ణించింది. దీంతో సదరు ఫిర్యాదును సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ మోసాలను సామాన్యమైన మోసాలుగా ఎటువంటి పరిస్థితుల్లోనూ పరిగణించలేమని సర్వోన్నత న్యాయస్థానం కుండబద్దలు కొట్టింది. ఒకప్పుడు రద్దీగా ఉండే ప్రదేశాల్లో దొంగలు చోరీలకు పాల్పడేవాళ్లు.. అలాగే రాత్రిళ్లు అందరూ నిద్రపోయాక ఇళ్లల్లోకి ప్రవేశించి దొంగతనాలు చేసేవాళ్లు.. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆన్‌లైన్ చోరీలు తెరమీదకు వచ్చాయి. ఫోన్ చేసి ఫలానా బ్యాంకు అధికారులమని పరిచయం చేసుకుంటారు. బ్యాంకు అకౌంట్ల అలాగే ఏటీఎం కార్డుల వివరాలు అడుగుతారు. అమా యక ప్రజలు ఇవన్నీ నమ్మి బోళాగా వివరాలు చెప్పేస్తారు. ఇంకేముంది కేటుగాళ్లు అందినకాడికి దోచుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా కేటుగాళ్లు ఇంటర్నెట్‌ను ఆధారం చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలన్నీ ఒకేలా ఉండవు. ఒక్కో నేరంలో ఒక్కో స్థాయి తీవ్రత ఉంటుంది. దీంతో సైబర్ క్రైమ్‌లను చూసి ప్రపంచ దేశాలు వణికి పోతున్నాయి. రోజురోజుకూ సైబర్ నేరాల తీవ్రత ఊహిం చనంత వేగంగా విస్తరిస్తోంది. ఏమైనా సైబర్ నేరాల పట్ల జనం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది.

# స్త్రీ చైతన్యం... ఓల్గా రచనల లక్ష్యం



పోపూరి లలిత కుమారి. ఈ పేరు చాలా మంది సాహిత్యాభిమానులకు అపరిచితం. కానీ ఓల్గా అంటే– తెలియని సాహితీ ప్రియులు లేరు. తెలుగునాట ఆమె పరిచయ అవసరం అసలే లేని అభ్యుదయ రచయిత్రి. ఓల్గా అంటే వేయి వోల్టుల ఒక అక్షర ప్రవాహం. ఆమె రచనలు కణకణ మండే నిప్పు కణికలు. ఆమె ప్రసంగాలు భగభగ మండే నినాదాలు. ఓల్గా అసలు సిసలైన స్త్రీ వాది. ఆమెకు స్త్రీవాదమే సందర్భం. స్త్రీవాదమే ఉద్యమం. స్త్రీవాదమే సాహత్యం. స్త్రీవాదమే నేపథ్యం. స్త్రీవాదం సాహిత్యం లోనూ, సమాజంలోనూ బలంగా నాటుకు పోవాలన్నదే ఆమె సంకల్పం. బలమైన ఉద్యమాలను నిర్మించుకుంటూ వెళ్తే తప్ప ఆకాశంలో సగం అవకాశంలో సగం లాంటి పదాలకు న్యాయం చేకూరదని ఆమె నమ్మారు. అందుకు ఆమె సాహిత్యాన్ని ఎంచుకున్నారు. ఆమె పెరిగిన నేపథ్యం, చుట్టూ ఉన్న సాన్ని హిత్యం, చదువుకున్న సాహిత్యం– అన్నీ కలగలిపి అభ్యుదయ భావాలకు ఊపిరి లూదాయి. గోర్కీలాంటి అనువాద పుస్తకాలు. పదో ఏటనే శ్రీశ్రీ మహాప్రస్థానం ఆమెపై ఎంతో ప్రభావం చూపాయి. తర్వాత చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనల వల్ల ప్రభావితమై, స్త్రీ చైతన్యము అంశముగా రచనలు చేసి, తనకై ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఓల్గాగా సుపరిచితులైన "పోపూరి లలిత కుమారి"కి ప్రత్యేక స్థానం ఉంది. రాజకీయ, సాహిత్య రంగపు చర్చలో స్త్రీవాద దృక్పధాన్ని ప్రవేశ పెట్టిన తెలుగు రచయిత్రిగా ఆమె గుర్తింపు పొందారు. ప్రగతిశీల రచయిత్రిగా... ఓల్గా కథలు, నవలలు, పద్యాలు స్త్రీ సాహిత్య ములో ఎన్నదగినవి. పత్రికలలో, సాహిత్యములో, అనువాద ములలో మహిళా హక్కులపై విస్తృత చర్చలకు ఆమె తెర లేపారు. స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఓల్గా, తనను తాను తెలుగులో గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కంతో ప్రారంభమైన అభ్యుదయ రచనా పరంపరలో భాగంగా కూడా భావించారు. నవంబర్ 27, 1950న గుంటూరు జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి గ్రామములో పోపూరి వెంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు ఆమె జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు సాహిత్యంలో స్నాతకో త్తర విద్య (ఎం.ఎ) పూర్తి చేసిన తర్వాత తెనాలిలోని వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యాపకు రాలిగా పనిచేశారు. చలన చిత్ర రంగములో 'ఉషా కిరణ్' సంస్థకు కథా రచయిత్రిగా పనిచేసి మూడు చిత్రాలు నిర్మించి పురస్కారాలు పొందారు. ఆమె రాసిన "స్వేచ్ఛ" నవలను వివిధ భారతీయ భాషల్లోకి అనువదించ డానికి నేషనల్ బుక్ ట్రస్టు స్వీకరించింది.1986 నుండి 1995 వరకు ఆమె ఉషా కిరణ్ మూవీస్ లో సీనియర్ కార్యవర్గ సభ్యురాలిగా పని చేసారు. 1991 నుండి 1997 వరకు అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ కు అధ్యక్షురాలిగా పని చేసారు. అమెరికన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ వారు ఓల్గా వ్రాసిన 12 రచనలను, ఆమె కథల ఆంగ్లానువాదములను తమ సంగ్రహములో చేర్చారు. రాజకీయ కథలు –1993, స్వేచ్ఛ – 1994, సహజ – 1995, ప్రయోగం – 1995, మానవి – 1998, కన్నీటి కెరటాల వెన్నెల – 1999, గులాబీలు – 2000, అకాశంలో సగం (ఉత్తమ నవల పురస్కారం), పలికించకు మౌన మృదంగాలు, అలజడి మాజీవితం, జీవితం, కన్నీటి కెరటాల వెన్నెల, అక్షర యుద్ధాలు – 2009, అతడు – ఆమె మనం – 2005, నవలా మాలతీయం – 2006, సరిహద్దులు లేని సంధ్యలు తదితరాలు ఆమె ప్రముఖ రచనలు. "స్వేచ్ఛ" నవలకు 1987 – ఉషోదయ పబ్లికేషన్స్ వారి ఉత్తమ నవల రచయిత అవార్డు, 1990 – ఉదయం మాగజిన్ వారు తోడు' అనే కథకు ఉత్తమ నవల రచయిత అవార్డు, 1998 – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నంది అవార్డు ఉత్తమ కథ రచయిత, 1999 – తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ స్త్రీ రచయిత అవార్డు, 2014 – లోక్ నాయక్ ఫౌండేషన్ సాహితీ పురస్కారానికి ఓల్గా ఎంపిక య్యారు. 2015 – ఆమె వ్రాసిన "విముక్త" కథల సంపుటి ద్వారా ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైనారు. ఈ సంకలనాన్ని డాక్టర్ కె.రామ చంద్రమూర్తి, డాక్టర్ ఎ.మంజులత, డాక్టర్ జి.యోహాన్ బాబుల జ్యూరీ బృందం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ కథల గురించి ఓల్గా... వర్తమాన సమాజంలో స్త్రీల వేదనలకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా. ఇవాల్టి సమాజంలో అనేక ఆంక్షలకూ అవమానలకూ హింసలకూ గురై వాటినధిగమించి లేస్తున్న స్త్రీలు కొందరైతే, వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక, నానా యాతనలు పడుతున్న స్త్రీలెందరో – తమను హింసించే భర్తల నుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తునే, అసహ్యించు కుంటునే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు – ద్వేషంతోతమను తాము హింసించుకోడం అలవాటైన స్త్రీలు – ఆ స్త్రీల కోసం ఈ కథలు అని పేర్కొన్నారు. స్వేచ్ఛ ఎవరో ఇచ్చేది కాదు. ఎవరినుండి సాధించుకునేది కాదు. మన అవసరాలను, మన ఉనికికి అత్యవసర విషయాలను మనం గుర్తించడమే స్వేచ్ఛ. నిజానికి అది సాధించడం చాలా కష్టం" అంటారు స్వేచ్ఛ నవల రాసిన సందర్భంలో. స్త్రీ ఎదుర్కొనే ప్రతి సమస్య గురించీ ఆమె ఒకో కథలో కనిపి స్తుంది. ప్రత్యేకత దాని ప్రయోజకత్వం. తాను సాహిత్యానికి ఓ ప్రయాజనం ఉండాలన్న ఆశయం తోనే రచనలు మొదలు పెట్టానని చెబుతారు ఓల్గా. ప్రతి కథలోనూ తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. అందుకనే ఆమె కథలో ఓ సూటిదనం కనిపిస్తుంది. అందులో ఒకోసారి సుదీర్ఘమైన చర్చలూ వినిపిస్తాయి. చివరికి ఓ పరిష్కారమూ ఉంటుంది. ఇలా స్త్రీ విముక్తి కోసం ఆమెకు ఉన్న మొక్కవోని ధృఢ సంకల్పం ఆమె ప్రతి కథలోనూ కనిపిస్తుంది.

## మెదక్ నూతన విద్యుత్ డివిజన్ ఇంజనీర్ గా రామేశ్వర స్వామి..



మెదక్,నవంబర్,26,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి మెదక్ విద్యుత్ శాఖ నూతన డివిజనల్ ఇంజనీర్ (డిఈ)గా రామేశ్వర్ స్వామీ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.సంగారెడ్డి టి ఆర్ఈ ఏడిఈగా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర స్వామీ పదోన్నతిపై మెదక్ డివిజన్ డిఈ నియమితులయ్యారు. ఈసందర్భంగా మెదక్ విద్యుత్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రామేశ్వర స్వామీ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు,సిబ్బంది సహకారంతో మెదక్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఈకార్యక్రమంలో 1104 యూనియన్ నాయకులు నేత ప్రసాద్, విఠల్ , రాంపురం నాగేష్, వరప్రసాద్, కామారం శ్రీనివాస్, వి ఎల్ ఎన్, రెడ్డి, విజయ్ కుమార్, రవీందర్ గౌడ్,మరాఠీ శ్రీనివాస్, ఇబ్రహీం,దుర్గా ప్రసాద్,టేక్మల్ సంగయ్య,బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

**జిల్లాలో మొదటి విడతలో 160 గ్రామపంచాయతీలలో 1402 వార్డు స్థానాలకు నామినేషన్లు**

**ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాట్ల పరిశీలన**







పాపన్నపేట,నవంబర్,26, మెదక్ టుడే న్యూస్: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పాపన్నపేట, టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడారు.సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామపంచాయతీ ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపచేయాలని అన్నారు. అలాగే ఓటరు జాబితా కూడా ప్రదర్శింపజేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. 30వ తేదీన నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 1వ తేదీన అప్పీళ్లు, 2వ తేదీన డిస్పోజల్, 3వ తేదీన ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు 147 మంది రిటర్నింగ్ అధికారులను నియమించామని తెలిపారు. ప్రతి రిటర్నింగ్ అధికారుల కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్లు నామినేషన్ సెట్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. నామినేషన్ లో ఖచ్చితంగా తేదీ, సమయం, క్రమ సంఖ్య నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లలో అభ్యర్థి సంతకం, ధ్రువీకరణ ప్రతిపాదకుని సంతకం ఉండాలని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో160 గ్రామపంచాయతీలలో 1402 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు చేసిన హెల్ప్ డెస్క్ లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించామని వివరించారు.ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, జోనల్, మండల ఆఫీసర్లు, ఎంసీసీ నోడల్ ఆఫీసర్లు, ఎఫ్ ఎస్ టీ, ఎస్ఎస్ టీ టీంలను నియమించి శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు.ఎఫ్ ఎస్ టీ, ఎస్ఎస్ టీ టీంలను విధులునిర్వర్తిస్తున్నాయని తెలిపారు.అన్ని ఆర్ఓ కార్యాలయాల్లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని,ఎన్నికకు సంబంధించిన పూర్తి సమాచారంఅందుబాటులో పెట్టాలని, నామినేషన్ల స్వీకరణ ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో మొదటి రెండు, మూడో విడతలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.దానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట వారి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం.




చేగుంట నవంబర్ 26 మెదక్ టుడే న్యూస్ చేగుంట మండల కేంద్రంలో గల హమాలీ సంఘ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరం చేగుంట లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి వైద్య శిబిరాని కటికె రాజేష్, లైన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ ఆకుల సుఖేందర్, సహకారంతో శిబిరాని నిర్వహించడం జరిగింది.ఇట్టి శిబిరానికి 183 మంది పేషెంట్లు చూపించుకోవడం జరిగిందని ఈ వైద్య శిబిరంలో 16 మంది వివిధ ఆపరేషన్ల కొరకై మల్లారెడ్డి హాస్పిటల్ కు తీసుకెళ్లడం జరుగుతుందని పి ర్ ఓ పవన్ కుమార్ సాయి, తెలపడం జరిగింది.ఈ వైద్య శిబిరంలో సుమారు 45 వేల ఉచిత మందులు డాక్టర్ల సలహా మేరకు పేషెంట్లకు ఇవ్వడం జరిగింది.ఈ వైద్య శిబిరంలో లైన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ ముచికట్ల శ్రీనివాస్, జోన్ ఛైర్పర్సన్ఆకుల సుఖేందర్ , ప్రెసిడెంట్ శంభుని శ్రీనివాస్, సెక్రెటరీ నాగరాజు, ట్రెజరర్ నాగేశ్వర్, పాస్ట్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్ , సతీష్ కుమార్ , పాల్గొనడం జరిగింది.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు యం.రాజా..



(స్టేట్ బ్యూరో)పల్నాడు జిల్లా, నవంబర్,26,మెదక్ టుడే న్యూస్: పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని ఎం ఆర్ ఆర్ న్యూస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీఐజేఏ అధ్యక్షులు యం.రాజా మాట్లాడుతూ, ఏపీ రాష్ట్రంలో ఎన్నడూ లేని కని విని ఎరగని అర్హతలు పెట్టి జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, గతంలో కేబుల్ నెట్వర్క్ ఛానల్స్ కి పర్మిషన్ ఎలా ఇచ్చారు..? అని సూటిగా ప్రశ్నించారు.కేబుల్ చానల్స్ కి పోస్టల్ లైసెన్స్ చెల్లుబాటు కానప్పుడు కేబుల్ చానల్స్ కి పోస్టల్ లైసెన్స్ పేరుతో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎలా ఇచ్చారో సమాధానం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎంత అని ఉంది అని భావిస్తున్న కేబుల్ ఆపరేటర్ . ఎంఎస్ ఓ,లు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు యంరాజా సూటుగా ప్రశ్నించారు.మినిస్ట్రీ ఆఫ్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్కాస్టింగ్ లైసెన్స్ ఎలా ఇచ్చారు.??లి ఏపీ ఫైబర్ నెట్వర్క్ లో నడుస్తానే ఆ ఛానల్ కి అక్రిడేషన్ ఉంటుందా..?? లక్షలు రూపాయలు పెట్టి పెట్టుబడి పెట్టుకొని వేయించి కేబుల్ కనెక్షన్ ఎమ్ ఎస్ ఓ,లకు తీవ్ర అన్యాయం జరుగుతున్నట్టు తెలుస్తుంది. పల్నాడు జిల్లాలోని ఉన్న కేబుల్ నెట్వర్క్ పై చానల్స్ ప్రసారం చేస్తున్నారో.. వారికి ఎంత మేర అర్హతలు ఉన్నాయో బ్రాడ్కాస్టింగ్ పర్మిషన్ ఉందా లేదా, ఎమ్మెస్ ఓ లెటర్ ఉందా లేదా, అసలు ఎందుకు బ్రాడ్కాస్టింగ్ పర్మిషన్స్.?? పోస్టల్ లైసెన్స్, లేబర్ లైసెన్స్, బ్రాడ్కాస్టింగ్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ పర్మిషన్స్, ఎన్ని సంవత్సరాలు బట్టి బుల్ టెన్స్ ప్రసారం చేస్తున్నారు, ఐటి రిటర్న్ ఉన్నాయా లేదా.? కేబుల్ చానల్స్ కి జిఎస్టి పే చేస్తున్నారా లేదా..? కరెంటు ఎకౌంటు ఉందా లేదా.? గత మూడు నెలలుగా ప్రసారం అవుతున్న ఉన్నాయా లేదా.? సీడీ ఫైల్ ఉందా లేదా.? వాస్తవ కథనాలు ప్రచురించారో లేదో..?? అనేక సందేహాలు అనుమానాలు నివృత్తి చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది..?

## రివాల్వర్ తో బెదిరించి రూ.2.5 లక్షల దోపిడి

- ఏడు పాయల్లో సంఘటన
- వచ్చింది దొంగలా.. పోలీసులా ...!
- బాధితులపై దాడి చేసిన దుండగులు
- పోలీసులని ఎదిరించలేకపోయామన్న బాధితులు



**పాపన్నపేట,నవంబర్,26, మెదక్ టుడే న్యూస్:** ఆధ్యాత్మిక కేంద్రం లో..అలజడి చెలరేగింది.ఏడు పాయల చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో దోపిడి జరిగింది. రివాల్వర్ తో బెదిరించిన అగంతకులు హల్చల్ చేశారు. విందు ముగించుకొని సరదాగా పేకాట ఆడుతున్న వారిపై దాడికి తెగ బడ్డారు.ఆపై దర్జాగా రెండున్నర లక్షలు దోచుకెళ్లారు. మంగళ వారం రాత్రి జరిగిన సంఘటన కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.అది అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల.దుర్గమ్మ తల్లి సన్నిధి సుమారు 60 మంది భక్తులు హీరాలాల్ షెడ్లో అర్ధరాత్రి సేధా తీరుతున్నారు అర్ధరాత్రి కావడంతో అంతా నిశ్శబ్ద వాతావరణం, అదే సమయంలో వారు సేద తీరుతున్న హీర లాల్ గెస్ట్ హౌస్ గేటు దూకి మూకుమ్మడిగా పదిమంది దుండగులు లోనికి చొరబడ్డారు. కొందరు మొదటి గేటు వద్ద కావలా ఉండగా మరికొందరు రెండో గేటు కాడ పహార కాచారు, మరో 6 మంది షెడ్లోనికి చొరబడ్డారు, చొరబడ్డ వారి వద్ద రివాల్వర్ ఉండడం కు తోడు దానితో భక్తులను బెదిరించారు. 60 మంది వరకు ఉన్న భక్తులు రివాల్వర్ చూసి కిమ్మనలేక నిచ్చేస్తులయ్యారు, దుండగులు లోనికి ప్రవేశించగానే రివాల్వర్తో బెదిరించి, వారివద్ద ఉన్న సెల్ ఫోన్లన్నీ తమకు అప్పగించాల్సిందిగా హుకుం జారీ చేశారు, భయభ్రాంతులకి గురైన భక్తులు అందరి సెల్ ఫోన్లు తీసి దుండగులకు అప్పగించారు, అందులోనుండి తేరుకున్న మెదక్ పట్టణానికి చెందిన ధర్మాకర్ రాజు అనే యువకుడు వారిని అడ్డగించే ప్రయత్నం చేశాడు వెంటనే, దుండగులు అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు, దీంతో తోటి భక్తుడి పై దాడితో భయ భ్రాంతులకు గురైన మిగతా భక్తులు నిచ్చేస్తుల్లై వారి వద్ద ఉన్న రెండున్నర లక్షలు దుండగులకు అప్పగించారు, అవి అందగానే దుండగులు గోడదుకి పరారయ్యారు, ఏడుపాయలలో ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్న ఇవి ఏమాత్రం బయటకు పొక్కడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి

**రివాల్వర్ చూసి భయపడ్డాం...**

భక్తుడు ధర్మకర్ రాజు, మెదక్ మేము ఏడుపాయల దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం విందు ఏర్పాటు చేసుకున్నాం, అర్ధరాత్రి కొంతమంది సేద తీరుతుండగా మరి కొంతమంది పేకాట ఆడుతున్నారు అదే సమయంలో పది మంది వరకు దుండగులు రివాల్వర్ తో వచ్చారు, వారిని చూసి అందరూ భయపడ్డారు నేనొక్కడిని ఎదుర్కొనే ప్రయత్నం చేశా నాపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాంతో నేను కూడా చేసేది లేక సరెండర్ అయ్యాను. ఆపై దుండగులు మా వద్ద ఉన్న రెండున్నర లక్షల నగదు ఎత్తుకొని పరారయ్యారు,

# ఆకాశయోధులకు వెక్కిరింతల నివాళా



ఇండియన్ ఏయిర్ఫోర్స్కు చెందిన తేజస్ యుద్ధవిమానం దుబాయి ఏయిర్ షోలో కుప్పకూలటం పత్రికల పతాక శీర్షికలకు అతీతమైన విషాదం. విమానాలు ఆవిరిజాడలతో ఆకాశంలో రాసే కవిత్వం ఈ వైమానిక విన్యాసాలు. ఈ విన్యాసాల్లో నైపుణ్యమే ప్రార్థన, ధైర్యమే నివేదన. ఇవి కెమెరాల కోసం జరిగే ప్రదర్శనలు కావుబీ మానవ కౌశలానికి అత్యున్నత తార్కాణాలు. ఈ వీరులు భూమ్యాకర్షణశక్తికీ తమ అదృష్టానికీ మధ్య ఒక ప్రమాదకరమైన అంగీకారంతో విమానాలు నడుపుతారు. తమ దేశ జెండా తరఫున ప్రాణాలు ఒడ్డేందుకు సిద్ధపడతారు. భారత వైమానికదళానికీ, సముద్రమంత విషాదంలో తల్లడిల్లుతున్న ఆ కుటుంబానికీ నేను నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ బాధ ఎలాంటిదో రెక్కల మీద ఎగిరే తోటి యోధులకే పూర్తిగా అర్థమవుతుంది. ఇక్కడ నేలకొరిగింది ఒక పైలట్ కాదు. ఊహకందని ఎత్తుల్లో పహారా కాసే ఆకాశ సంరక్షకుడు. ఈ రాత్రి ఎక్కడో ఒక యూనిఫామ్ ఖాళీగా వేలాడుతుంది. ఎవరో ఒక పిల్లాడు 'నాన్న ఎప్పుడు వస్తాడు?' అని అడుగుతాడు. మొత్తం ఆకాశమే మరింత ఖాళీ అయినట్టు కనిపిస్తుంది. ఈ దుర్ఘటనకు మించి, ఈ విషాదానికి మించి, నన్ను బాధపెడుతున్నది సరిహద్దుకు ఇటువైపు మా దేశం నుంచి పొంగుతున్న వెక్కిరింతల విషం. దేశ సరిహద్దు అయినా సరే, గగన వీరుల సహోదరత్వాన్ని విడదీయకూడదు. ఇలాంటి ప్రవర్తన దివాలాకోరుతనమే తప్ప దేశభక్తి అనిపించుకోదు. మనం అవతలివారి సిద్ధాంతాలనూ, వ్యూహాలనూ, విధానాలనూ ఎంతయినా ప్రశ్నించవచ్చు, తప్పులేదు. కానీ, మర్యాదకు విలువ ఉండే ప్రపంచంలో బతికే ఎవ్వరూ కూడా, ఆకాశపుటంచుల్లో విధులు నిర్వహించే యోధుడి సాహసాన్ని వెక్కిరించకూడదు. ఆ యోధుడు చప్పట్ల కోసం కాదు, దేశంపై ప్రేమతో ఎగిరాడు, మన దేశ యోధుల్లాగానే. అందుకు మనం ఇవ్వాల్సింది మర్యాద. కుళ్లిపోయిన దేశాభిమానాన్ని ముసుగు వేసుకుని వెక్కిరించటం కాదు. ఇలాంటి విషాద నీరవంలోకే మన యోధులెందరో మాయమవటాన్ని నేను చూశాను. ఫ్లైట్ లెఫ్టినెంట్ ఆలందార్, స్క్వాడ్రన్ లీడర్ హసంత్ ఇలాంటివారే. వీరంతా దేవతలు ఊపిరిబిగబట్టి చూసేంత ఎత్తుల్లో విహరించారు, ఆకాశం ఎంతో తెగింపును కోరుతుందనీ, బదులుగా ఎలాంటి భద్రతనూ హామీ ఇవ్వదనీ వారు అర్థం చేసుకున్నారు. గగనతలంలో యుద్ధవిమానం హఠాత్తుగా నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు%-% ఇక అక్కడ దేశ పౌరసత్వాలు లేవు, జాతీయ గీతాలు లేవు, జెండాలు లేవు. అక్కడ మిగిలేదల్లా అందరికీ సమానమైన విషాదమే! మేఘాల్లో కలిసిపోయిన వారి ఫొటోలను తడిమి రోదించే కుటుంబాలే! నిజమైన ప్రొఫెషనల్, తోటి ప్రొఫెషనల్ను ఎన్ని అడ్డుగోడల అవతలనుంచైనా గుర్తుపడతాడు. నిజమైన యోధుడు తోటి యోధుడి ధైర్యానికి%-% అది వేరే రంగు యూనిఫామ్ తొడుక్కున్నా, వేరే రంగు జెండా కింద ఎగిరినా, వేరే భాష మాట్లాడినా%-% సెల్యూట్ కొడతాడు. అంతకంటే ఏ మాత్రం తక్కువ స్థాయిలో వ్యవహరించినా అది వారికి కాదు, మనకే అప్రతిష్ఠ. మన వెక్కిరింత మన రెక్కలకే మరకలాగా అంటుకుంటుంది, నేలకొరిగిన మన యోధుల గౌరవాన్నే మంటగలుపుతుంది, మన వీరాలాపాలనే డొల్లచప్పుళ్లుగా మారుస్తుంది. ధైర్యానికి పాస్పోర్టులు ఉండవు. బలిదానానికి సరిహద్దు విభజనలు తెలియవు. దేశ ప్రతిష్ఠ కోసం తన యుద్ధ విమానాన్ని గగనతల అవధుల్లోకి దూకించే పైలట్ మన మర్యాదకు పాత్రుడు%-% అతను కాషాయ, తెలుపు, పచ్చ జెండా తరఫున ఎగిరినాబీ లేక పచ్చ, తెలుపుజెండా తరఫున ఎగిరినా! నిష్క్రమించిన ఆ వైమానిక యోధుడు ఇక విమానాలు విఫలం కాని, ఏ కల్లోలాలూ లేని ఆకాశాలకు చేరుకోవాలని ఆశిస్తున్నాను. అతని కుటుంబం తమ వియోగాన్ని మానవుని సాహసికాంశకు ఉత్కృష్ట తార్కాణంగా అర్థం చేసుకుంటారనీ భావిస్తున్నాను. ఇక మనం%-% రక్తంతో గీసిన సరిహద్దులకు ఇరువైపులా ఉన్న మనం%-% మర్యాద ఇవ్వాల్సిన దానికి మర్యాద ఇచ్చే పెద్దరికాన్నీ, బాధపడాల్సిన వాటికి బాధపడే పరిణతినీ సాధిస్తామని తలుస్తాను. వేర్వేరు దేశాలకు పౌరులుగా మారే కంటే ముందే మనమంతా ఆకాశదేశానికి పౌరులం. ఏదో రోజు నశించిపోయే మనమంతా, శాశ్వతమైనది ఏదో అందుకునే ప్రయత్నంలో పైకి ఎగిరేవాళ్లమే, భూమ్యాకర్షణ వెనక్కు లాక్కునేలోగా.

## చేగుంట పిఎం శ్రీ ఉన్నత పాఠశాల లో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు.

**ముఖ్య అతిథి గా విచ్చేసిన విద్యాధికారి కే విజయ**

**మన రాజ్యాంగం ప్రపంచానికె ఆదర్శం మెదక్ జిల్లా విద్యాధికారి కె విజయ**



చేగుంట నవంబర్ 26 మెదక్ టుడే న్యూస్ చేగుంట మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడైన చల్లా లక్ష్మణ్ రాజ్యాంగ పరిషత్ లోని సభ్యులందరి ఫోటోలను సేకరించి ఫోటో గ్యాలరీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా విద్యాధికారి కె.విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాజ్యాంగం రచించినటువంటి సభ్యులందరి ఫోటోలు సేకరించి, ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో రాజ్యాంగం పట్ల అవగాహన కలుగుతుందని, రాజ్యాంగం ఆదర్శాలను పాటించాలని హక్కులతో పాటు, విధులను కూడ నిర్వహించాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏఎంఓ సుదర్శనమూర్తి, మండల విద్యాధికారి నీరజ, ఇన్చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు రాజేశ్వర్, రఘుపతి, సుధాకర్ రెడ్డి, రాధ, సరస్వతి, రమా, రమాదేవి, శారద, రేఖ,రావుల వెంకటేష్,మనోహర్ రావు, సురేందర్, శ్రీ వాణి , ఉమా, ఉమామహేశ్వరి, హిమవర్ష, సిఆర్పి రమేష్, సత్యనారాయణ ఇతర పాఠశాలలో ఉపాధ్యాయులు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హీరాలాల్ ఫంక్షన్ హాల్ పై దాడి

**- ఆలస్యంగా .. వెలుగు లోకి .!**

**- అధికారుల పర్యవేక్షణ కరువు**




పాపన్నపేట,నవంబర్,26, మెదక్ టుడే న్యూస్: మెదక్ స్పెషల్ పోలీసులు ఏడుపాయలలో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది .! మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయ సమీపం లోని హీరాలాల్ ఫంక్షన్ హాల్ లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేయగా పేకాట రాయుళ్ళు పట్టుకునేందుకు వెళ్ళిన పోలీసుల పై దాడి చేసేందుకు వారు ప్రయత్నం చేయడంతో అనుకొని సంఘటనగా గుర్తించిన పోలీసు ఉన్నత అధికారి తన వెంట ఉన్న రివాల్వర్ చూపించడంతో బయపడిన పేకాట రాయుళ్ళు వెనుకంజ వేశారు. కుటుంబీకులతో కలిసి విందులో పాల్గొనేందుకు వచ్చామని వదిలి పెట్టాలని వేడుకోవడంతో పోలీసులు వదిలి పెట్టినట్లు ఓ ఉన్నత అధికారి వెల్లడించారు. పోలీస్ అవుట్ పోస్టు కేంద్రం సైతం అక్కడే ఉంది. గత సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అయినా ఇలాంటి నేరా ఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టడంలో దేవాదాయ శాఖ,అబ్కారీ శాఖ,పోలీస్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు.

# కొల్లేరులో విదేశీ అతిథుల సందడి

- ఎటు చూసినా పక్షుల కిలకిలరావాలే
- విదేశీ పక్షులతో కొత్త కళ
- శీతాకాలంలో విడిది పక్షుల సందడి
- అక్టోబరు నుంచి మార్చి చివరి వరకు కనువిందు





**ఏలూరు :**
ఎలూరు జిల్లా కొల్లేరు ప్రాంతానికి లక్షలాదిగా విదేశీ పక్షులు తరలివచ్చాయి. ఎటు చూసినా కిలకిల రావాలే.. కొల్లేరులో విదేశీ పక్షుల సందడి కనిపిస్తోంది. శీతాకాలం విడిది కోసం సైబీరియా నైజీరియా ,యూరప్, టర్కీ ,రష్యాల నుంచి విదేశీ అతిథులు వచ్చాయి. విదేశీ పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఏటా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కొల్లేరు పక్షుల వీక్షణకు అనువైన కాలం. ఈ ఏడాది ఎక్కువ మంది పర్యాటకులు కొల్లేరుకు విచ్చేస్తారని అటవీ శాఖ అంచనా వేస్తోంది. సర్వేల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌లో 482 పక్షి జాతులు ఉన్నాయి. సింహభాగం 210 పక్షి జాతులు కొల్లేరులో సంచరిస్తాయి. ఈ పక్షులు ఇక్కడే గూడ్లు ఏర్పరచుకుని గుడ్లు పెడతాయి. మళ్లీ మార్చిలో పిల్లలతో కలిసి తమ దేశాలకు వెళతాయి.

మనస్సు దోచే అరుదైన పక్షులకు నెలవు కొల్లేరు కు అతిథులు వచ్చేశాయి. ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన కైకలూరు ఆటపాక కొల్లేరులోని పక్షుల కేంద్రానికి లక్షలాది కిలోమీటర్ల నుంచి వలస పక్షులు తరలి వచ్చాయి. కొల్లేరు సరస్సు విదేశాల నుంచి వచ్చిన వలస పక్షులతో కొత్త అందాలు కనువిందు చేస్తున్నాయి. శీతాకాలం విడిది కోసం సైబీరియా నైజీరియా ,యూరప్, టర్కీ ,రష్యా దేశాల నుంచి ఏలూరు జిల్లా కొల్లేరు ప్రాంతానికి చేరుకున్న లక్షలాది విదేశీ పక్షులు వచ్చాయి.

## కొల్లేరుకు ప్రతి ఏటా వచ్చే విదేశీ వలస పక్షులు..

నార్తరన్ పిన్‌టైల్ (సూది తోక బాతు), రెడ్ క్రిస్టడ్ పోచర్డ్ (ఎర్రతల చిలువ), కామన్ శాండ్ పైపర్ (ఉల్లంకి పిట్ట), పసిఫిక్ గోల్డెన్ ప్లోవర్ (బంగారు ఉల్లంకి), కామన్ రెడ్ షాంక్ (ఎర్రకాళ్ల ఉల్లంక్), బ్రాహ్మణి షెల్ డక్(బాపన బాతు), గ్రేట్ వైట్ పెలికాన్ (తెల్ల చిలుక బాతు), బ్లాక్ క్యాప్డ్ కింగ్‌ఫిషర్(నల్ల తల బుచ్చిగాడు), గుల్ బిల్డ్ టర్న్(గౌరి కాకి ముక్కు రేవుపిట్ట), కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి), గ్రేటర్ శాండ్ ప్లోవర్(పెద్ద ఇసుక ఉల్లంకి), రూఫ్ (ఈల వేసే పెద్ద చిలువ), మార్ష్ శాండ్‌పైపర్ (చిత్తడి ఉల్లంకి) వంటివి దాదాపు 71 జాతులు ఉన్నట్టు గుర్తించారు.

# భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

**మొదటి పేజీ తరువాత..**
ఈ వేడుకలో పాల్గొన్నారు. రాష్ట్రపతి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనాన్ని చేపట్టారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను విడుదల చేశారు.
ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడారు. ''ఈ చారిత్రాత్మక దినోత్సవం సందర్భంగా మీ అందరి మధ్య ఉండటం నాకు సంతోషంగా ఉంది. 1949, నవంబర్ 26న రాజ్యాంగసభ సెంట్రల్ హాలులో రాజ్యాంగ సభ సభ్యులు భారత రాజ్యాంగాన్ని రూపొందించే పనిని పూర్తి చేసి ఆమోదించుకున్నారు. ముసాయిదా కమిటీ ఛైర్మన్ బీఆర్ అంబేద్కర్ మన రాజ్యాంగ వాస్తుశిల్పుల్లో ముఖ్యులు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయడం ద్వారా మన సోదరీమ ణుల సాధికారతకు పార్లమెంట్ చర్యలు తీసుకుంది. జీఎస్టీ ద్వారా ఆర్థిక సమైక్యతను ప్రోత్సహించారు. ఆర్టికల్ 370తో రాజకీయ సమైక్యతకు ఉన్న ఆటంకం తొలగిపో యింది'' అని స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. కాగా.. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వశాఖలు, విభాగాలు, వాటి అనుబంధ కార్యాలయాలు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి.





## ఎస్వీయూ యూనివర్సిటీలో
# చిరుత కలకలం

- సీసీ కెమెరాలో కోళ్ల గూడుపై చిరుత దాడి దృశ్యాలు రికార్డ్
- బోన్లకు చిక్కకుండా మూడు చిరుతలు సంచారం
- భయాందోళనలో ఎస్వీయూ సిబ్బంది
- హడలిపోతున్నా విద్యార్థులు

తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో (ఎస్వీయూ) తరచుగా చిరుత సంచరిస్తుండటం తీవ్ర కలకలం రేపుతోంది. చిరుత సంచారంతో విద్యార్థులు, యూనివర్సిటీ ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రుళ్లు యూనివర్సిటీ ప్రాంగణంలో చిరుత ఎక్కువగా తిరుగుతోంది. దాదాపు కొన్ని నెలలుగా చిరుత తరచూ కనిపిస్తుం డటం అక్కడి వారిని ఆందోళనకు గురిచే స్తోంది. తాజాగా గత రాత్రి ఎస్వీయూ ఉద్యోగుల క్వార్టర్స్ వద్ద చిరుత హల్‌చల్ చేసింది. యూనివర్సిటీలో రాత్రి సంచరిం చిన చిరుత.. కోళ్ల గూడుపై దాడి చేసింది. చిరుత దాడిలో హడలిపోయిన కోళ్లు అరు పులతో శబ్దాలు చేశాయి. కోళ్ల గూడుపై చిరుత దాడి చేసిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి.
మరోవైపు చిరుత కదలికలతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కొన్ని వారాలుగా వేదిక్, వెటర్నరీ, ఎస్వీ యూని వర్సిటీ క్యాంపస్‌లో చిరుతలు తిరుగు తున్న వైనం భయాందోళనకు గురిచే స్తోంది. చిరుతలను పట్టుకునేందుకు దాదాపు ఐదు చోట్ల అటవీశాఖ అధికా రులు బోన్లను ఏర్పాటు చేశారు. అయిన ప్పటికీ బోన్లకు చిక్కకుండా ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో మూడు చిరుతలు సంచరిస్తున్నాయి. ఇక చిరుత సంచారం నేపథ్యంలో క్యాంపస్ రోడ్లపై రాత్రి 7 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు రాకపోకలపై అధికారులు నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయినప్ప టికీ తరచూ ఇలా చిరుత సంచరిస్తుండ టంతో విద్యార్థులు హడలిపోతున్నారు.

# ఎయిరోస్పేస్.. డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్



**మొదటి పేజీ తరువాత..**
భారీ పెట్టుబడులను ఆకర్షించాయని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయి. గడిచిన 9 నెలల కాలంలో ఎగుమతులు 30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతులను అధిగమించడం గమనార్హం. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని గుర్తు చేశారు.
రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టి పెడుతోం దని సీఎం చెప్పారు. . నైపుణ్యతను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చి దిద్దామన్నారు. ప్రపంచ దేశాల్లోనే అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానా శ్రయం సమీపంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నామని రేవంత్ వివరించారు. భారత లక్ష్యాలను చేరుకోవడంలో భాగస్వామిగా ఉండాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం..అని ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్ర మంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్ , సీఈఓ, డైరెక్టర్ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో స్టీఫెన్ క్యూయెల్, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



# భారత రాజ్యాంగం ద్విభాషా గ్రంథం విడుదల

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ న్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లీషు భాషలో ముద్రించిన భారత రాజ్యాంగం ద్విభాషా గ్రంథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రాజ్యాంగాన్ని సమగ్రంగా తెలుగులో అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అన్నారు. రాజ్యాంగం తెలుగు భాషలో ప్రచురించడం వల్ల భాష, సంస్కృతిని కాపాడటంతో పాటు భావి తరాలు, మేథావులు, సాహిత్యాభిమానులకు ఎంతో ఉపయుక్తంగా అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెలుగులో తర్జుమా చేసి సమగ్రంగా రాజ్యాంగాన్ని తెలుగు–ఇం గ్లీషు ద్విభాషలో అందించడం వల్ల అనేక విషయాల్లో స్పష్టత ఉంటుందని, ముఖ్యంగా తెలుగు వారికి, సామాన్యులకు సులభంగా రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవడానికి వీల వుతుందని అన్నారు. ఈ రాజ్యాంగ ప్రతులను విడుదల చేసిన సందర్భంగా న్యాయ శాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి, ఆ శాఖ ఇతర అధికారులు ఉన్నారు.

హైదరాబాద్ ప్రతినిధి



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై
# ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025పై బుధవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ఏర్పాట్లు, ఇతర అంశాలపై వారు చర్చించారు.

హైదరాబాద్ ప్రతినిధి

# ఢిల్లీ కాలుష్యంతో నేనూ ఇబ్బందిపడ్డా

## సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

### గంటపాటు వాకింగ్‌కు వెళ్లడంతో.. శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనట్లు వెల్లడి



**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుడంతో.. అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళ వారం గంటపాటు వాకింగ్‌కు వెళ్లడంతో తనకు శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విచారణలను వర్చువల్ మోడ్‌కు మార్చడానికి బార్ అసోసియే షన్ అంగీకరిస్తే.. కోర్టు ఏకరీతి నియమాన్ని రూపొందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
గత రెండు వారాలుగా వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ)లు దారుణంగా పడిపోతుండడం.. తీవ్ర కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తుండడంతో 60 ఏళ్లు పైబడిన న్యాయవాదులు వ్యక్తిగతంగా కోర్టుకు రావడానికి బదులుగా వర్చువల్ విధానంలో విచారణకు హాజరు కావడా నికి అనుమతించాలని సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది విజ్ఞప్తి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సైతం రాకేష్ ద్వివేది వ్యాఖ్యలతో ఏకీభవించారు. 60 ఏళ్ల వయసులో తాము వాయు కాలుష్యంతో సమస్యలు ఎదు ర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. తాను కూడా ఇబ్బంది పడుతు న్నానన్నారు.
జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో ధర్మాసనం రెండు వారాల క్రితమే ఢిల్లీ కాలుష్యంపై న్యాయవాదులను హెచ్చరించింది. పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పుడు న్యాయవాదులు స్వయంగా కోర్టుకు హాజరు కానవసరం లేదని.. వర్చువల్ హియరింగ్ సౌకర్యాన్ని విని యోగించుకోవాలని లాయర్లకు సూచించింది. ఈ విషయంపై ప్రధాన న్యాయమూర్తితో చర్చిస్తామని తెలిపింది.
దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యత సూచీ తీవ్రంగా పడిపో తుండడంతో పర్యావరణ శాఖ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీ పరిధి లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాల యాల్లో విధులకు హాజరయ్యే సిబ్బందిలో 50 శాతం మంది ఇంటి నుంచే పనిచేయాలని, మిగిలిన సగం మంది మాత్రమే కార్యాలయాలకు రావాలని ఆదేశించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం–1986లోని సెక్షన్ 5 నిబంధన ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమ లులోకి వస్తాయని తెలిపింది. నగరంలో వాహనాల రాకపోకలను తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకు న్నట్లు వెల్లడించింది. 50శాతం మందికి 'వర్క్ ఫ్రం హోం' నిబంధనను అన్ని సంస్థలూ పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.


# అనువర్తిత గణితంలో శ్రీనివాసరెడ్డికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. న్యూటోనియన్ కాని ద్రవాల లో వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రవాహ సమస్యల సంఖ్యా విశ్లేషణపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమ ర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోవర్ధన్ బుధవారం విడుదల చేసిన ప్రక టనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి అధ్యయనం వివిధ ఇంజినీ రింగ్, పారిశ్రామిక ప్రక్రియలలో ముఖ్యమైన అనువర్తనాలను కలిగి ఉన్న న్యూటోనియన్ కాని ద్రవాల సంక్లిష్ట ప్రవర్త నపై విలువైన అంతర్దృష్టులను అందిస్తుంద న్నారు. ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ. పట్టాకు అర్హత సాధిం చడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మైలురాయి అత్యాధునిక పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో గీతం యొక్క దృఢమైన నిబద్ధతను ప్రస్ఫుటిస్తోందన్నారు.

# తెలంగాణ వన్యప్రాణి సంరక్షణలో కొత్త అధ్యాయం



**మొదటి పేజీ తరువాత..**
వంటి రాష్ట్రాలు ఈ విధానాన్ని ఎక్కువగా వాడుతుండగా, ఎన్.టీ.సీ.ఏ.అనుమతి లభించిన వెంటనే తెలంగాణ కూడా ఈ జాబితాలో చేరనుంది. ఈ డేటా మొత్తం టైగర్ సెల్ నుంచే సేకరించి విశ్లేషించబడుతుంది. దాంతోపాటు, జాతీయ టైగర్ లెక్కల్లో తెలంగాణకు అదనపు ప్రయోజనం లభించనుంది.దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ (ఏ.ఐ.టీ.ఈ.) లో తెలంగాణకు నూతన సెల్ పెద్దగా సహకరించనుంది. కేవలం రిజర్వుల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పులుల కదలిక పెరుగుతున్న వేళ, ఈ సెల్ కీలకంగా మారనుంది. భారతదేశంలో పులుల సంరక్షణకు గట్టి సమన్వయం, సాంకేతిక నిఘా, వేగవంతమైన ఫీల్డ్ స్పందన అవసరమైన ఈ సమయంలో, తెలంగాణ టైగర్ కమాండ్ అండ్ కంట్రోల్ సెల్ జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతగల ముందడుగుగా నిలవనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
అడవులు, అడవుల్లో వన్య ప్రాణులను సంరక్షించడమే తమ ప్రజా ప్రభుత్వం జెండా... ఎజెండా అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వన్య ప్రాణులు ఇతర జీవుల మనుగడ మీద మన ఉనికి ఆధారపడి ఉందనే విషయం మనం నిత్యం గుర్తుంచుకోవాలన్నారు. పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో మనుషులు, వన్య ప్రాణుల మధ్య తరుచూ జరిగే సంఘర్షణలు.. దాడులు నేపథ్యంలో మన తెలంగాణలో ఇప్పటికే పలువురు మనుషులు మరణించారన్న విషయం అందరికీ తెలిసిందేనని వివరించారు. కొన్ని క్రూర జంతువులు కూడా ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో.. మనుషుల భద్రత, వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు 2019లోనే పలు కీలక సూచనలు చేసిందని తెలిపారు. వాటి ఆధారంగా తాము ముందుకు వెళుతున్నట్టు వివరించారు.




# హైడ్రా చర్యలు భేష్..

**మొదటి పేజీ తరువాత..**
పునరుద్ధరణలో ఎదురైన సవాళ్లను.. వాటిని అధిగమించిన తీరును అడిగి తెలుసుకున్నారు. బెంగళూరులోని చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ జరుగుతున్న తీరును పరిశీలించిన హైడ్రా.. అనతి కాలంలోనే తామే ఇక్కడకు వచ్చి చూసేలా చెరువులను పునరుద్ధరించారు. బతుకమ్మకుంటను చూశాం.. ఆక్రమణలకు గురై.. నాడు ముళ్ల పొదలతో ఉన్న చిత్రాలను, వీడియోను చూశాం.. నేడు అక్కడ నయనమనోహర దృశ్యం కనిపించింది. ఆక్రమణలు తొలగించి ఏకంగా చెరువును సృష్టించిన తీరు.. అద్భుతం అనిపించింది. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా.. వరద ముంచెత్తలేదని స్థానికులు చెప్పిన విషయాన్ని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఇదే పరిస్థితి మిగతా చెరువుల చెంత ఉందని కొనియాడారు. బెంగళూరు నగర మాజీ మేయర్, చెరువులను పునరుద్ధరణలో భాగస్వామ్యం అయిన అధికారులు, కాంట్రాక్టర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సాంకేతిక బృందంతో సభ్యులు నగరంలో హైడ్రా పునరుద్ధరించిన చెరువుల సందర్శనలో ఉన్నారు.

# సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వండి

## ఎంపీ ఈటలకు టీఎస్ యూటీఎఫ్ వినతి

హైదరాబాద్ ప్రతినిధి

ఎస్.టీ.ఎఫ్.ఐ పిలుపులో భాగంగా బుధవారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి లోకసభ సభ్యులు ఈటెల రాజేందర్ ను ఆ సంఘం నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంటులో చట్ట సవరణ ద్వారా సీనియర్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చి వారి ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ పాతిక, ముప్పై సంవత్సరాల సర్వీసు చేశాక ఇప్పుడు అర్హత పరీక్ష వ్రాయాలనటం అర్థరహితమని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి మినహాయింపు కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.టీ.ఎఫ్.ఐ ప్రధాన కార్యదర్శి, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, వోట్ ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జయసింహారెడ్డి, ఎం మదన్ రెడ్డి, జిల్లా నాయకులు మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, పురుషోత్తమ్, శ్రీనివాస్, కుమార్, స్వప్న, బంటు రాజు, హరేరామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



Printed Published and owned by **CHILVERA SHIVAKUMAR** and Printed **JWAALA PRINTERS** H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303-
Gmail.“medaktoday94@gmail.com,Editor: **CHILVERA SHIVAKUMAR**. RNI NO.: **TELTEL/2023/88524**, 9948265095, 9494117870